

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దాం

● తొలి డీఆర్సీ సమావేశంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం మంత్రి అధ్యక్షతన తొలి జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్సీ) సమావేశం జరిగింది. దాదాపు నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. మొత్తం 53 అంశాలతో అజెండా రూపొందించగా వ్యవసాయం, ఉద్యాన, పట్టు పరిశ్రమ, పాఠశాల విద్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ శాఖ అంశాలపై మాత్రమే చర్చ జరిగింది. తొలుత రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర 2047కు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలోనే అత్యధికంగా అభిప్రాయాలు సేకరించిన జిల్లాల్లో చిత్తూరు ఐదో స్థానంలో నిలిచిందన్నారు. ప్రపంచ బ్యాంకు నిధులు, జైకా నిధులు, ఎంఎస్‌పీ నిధుల ద్వారా జిల్లాలో ఈ ఏడాది రూ.15కోట్లతో 17 కాలువ పనుల మరమ్మతులు చేపట్టగా.. 2740 ఎకరాల ఆయుకట్టును సాగులోకి తెచ్చామన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా కుప్పం నియోజకవర్గం, విజయపురం మండలం కోసలనగరం, చిత్తూరు మండలంలోని వెంకటాపురం, పలమనేరులో ఇండస్ట్రియల్ పార్కు నిర్మించడం జరుగుతుందన్నారు. 782 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సాయంతో మూడు లక్షల ఎకరాలను రీసర్వే చేశామన్నారు. ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీలో, స్వర్ణాంధ్రమిషన్ 2047 అభిప్రాయ సేకరణలో జిల్లా ఐదో స్థానంలో నిలిచిందన్నారు. స్వచ్ఛతాహీ సేవలో జిల్లాను ముందంజలో నిలిపిన కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరిలను ఈ సందర్భంగా అభినందించారు. పీజీఆర్ఎస్ కింద అందిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ శాఖ కార్యక్రమాలను డీఆర్వో మోహన్‌కుమార్ వివరించారు. తొలుత సీపీవో సాంబశివారెడ్డి సమీక్ష కమిటీ ఉద్దేశాలను తెలియజేశారు. సమావేశంలో కమిటీ కన్వీనర్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్, థామస్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ విద్యాధరి, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, కడా పీడీ వికాస్ మర్మత్, డీఎఫ్‌వో భరణి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎవరేమన్నారంటే..

- వివరాలు 7లో.. -

కొత్తగా ఎన్నికయ్యామని మాపై చులకనా?

అధికారుల తీరుపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల ఆవేదన

ఫ్రెండ్లీ ప్రభుత్వమని అధికారులు గుర్తుంచుకోవాలి: మంత్రి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'కొత్తగా ఎన్నికయ్యామని మాపై చులకన భావమా?' అంటూ అధికారుల తీరుపై డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్సీతోపాటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. 'ఇటీవల కుప్పంలో జరిగిన సమావేశాలపై నాకు విద్యాశాఖ అధికారులు సమాచారం ఇవ్వలేదు. అంతర్గత సమావేశాలంటూ తప్పించుకుంటున్నారు. విపరీతంగా లంచాలు తీసుకుంటున్నారు. కనీసం ఎమ్మెల్సీకి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదు. సీఎం చంద్రబాబు, కలెక్టర్‌ను కలవాలంటే క్షణాల్లో అపాయిమెంట్ ఇస్తున్నారు. అధికారులు మాత్రం గంటలపాటు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని సభలో చెప్పాలంటే ఎంతో బాధగా ఉంది.' అన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ.. 'మేమందరం తొలిసారిగా ఎన్నికయ్యామన్న చులకన భావంతో అధికారులు ఉన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికల్లో గెలిచి వచ్చాం. మాపై ఇగో ఎందుకు చూపిస్తున్నారు? కనీస గౌరమిస్తే సంతోషపడతాం' అన్నారు. పూతలపట్టు, జీడీ నెల్లూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, థామస్ మాట్లాడుతూ.. 'ప్రజల నుంచి వచ్చాం.. ప్రజల కోసం పని చేస్తాం. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అధికారుల కంటే ఎమ్మెల్యేలే చక్కగా పనిచేస్తున్నారు' అన్నారు. 'ప్రధానంగా డీఈవో, ఎస్ఎస్ పీవో, అటవీశాఖ అధికారి తీరు సరిగా లేదు. వారు చేస్తున్న తప్పులపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయండి. మేమంతా సీఎంకు ఫిర్యాదు చేస్తాం' అని ముక్తకంఠంతో అనడంతో పది నిమిషాలపాటు సమావేశంలో నిశ్శబ్దం నెలకొంది. అనంతరం అధికారులను ఉద్దేశించి మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడారు. 'ప్రజా ప్రతినిధుల మాటలకు విలువ ఇవ్వండి. వారి వినతులపై సానుకూలంగా స్పందించండి. గత ప్రభుత్వ పాలకుల్లా మెడపై కత్తి పెట్టి పనిచేయించుకోవడం లేదు కదా.. మీపై మాకెలాంటి ద్వేషం లేదు. ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వమని గుర్తించుకోండి. సీఎంపై నమ్మకముంచి జిల్లా అభివృద్ధికి సహకరించండి. సమర్థవంతంగా పని చేసే అధికారులను సన్మానిస్తాం. ఇకపై ఇలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోండి' అని సున్నితంగా మంత్రి మందలించారు.

హుందాగా సమావేశం నిర్వహణ

గత ప్రభుత్వంలో ఒక్కరిదే పెత్తనం

ఇప్పుడు అందరికీ అవకాశం



జడ్పీలోని ఎన్టీఆర్ విగ్రహం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో డీఆర్సీ సమావేశం ఏకఛత్రాధిపత్యంతో జరిగేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆదివారం జరిగిన తొలి డీఆర్సీ సమావేశం ఎంతో హుందాగా నిర్వహించడం చర్చనీయాంశమైంది.

గతంలో ఇలా.. : గత పాలనలో జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఐదేళ్లపాటు వ్యవహరించిన ఉషశ్రీ చరణ్ అధ్యక్షతన డీఆర్సీ సమావేశాలు జరగాల్సి ఉన్నా.. ఆమెకు మాట్లాడే అవకాశం ఉండేది కాదు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హవానే జిల్లా అంతటా కొనసాగేది. సమావేశంలో అప్పటి వైసీపీ ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలున్నా ఎవరూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు పెద్దిరెడ్డి సమక్షంలో ఉండేది కాదు. ఎవరైనా ధైర్యం చేసి ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తే.. మంత్రి పెద్దిరెడ్డి జోక్యం చేసుకుని 'పాలకపక్ష సభ్యుడివా, ప్రతిపక్షానికి చెందినవాడివా, ఎక్కడ మాట్లాడాలో సమయం, సందర్భం తెలియదా.. కూర్చో.. ఏదైనా సమస్య ఉంటే తర్వాత నావద్దకు రా' అని గద్దించేవారు. మీడియానూ అనుమతించేవారు కాదు.

ప్రస్తుతం ఇలా.. :
ఆదివారం జరిగిన డీఆర్సీ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలందరినీ చర్చల్లో భాగస్వాములను చేశారు. వారి అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించే స్వేచ్ఛను ఇచ్చారు. మీడియాను అధికారులే ఆహ్వానించారు.

కనిపించేలా ఎన్టీఆర్ విగ్రహం

జడ్పీ మీటింగ్ హాలు ఆవరణంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని వైసీపీ హయాంలో ఎవరికీ కనిపించకుండా తెరను ఏర్పాటుచేసేవారు. ఇప్పుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని అందరికీ కనిపించేలా పెట్టారు.

భార్యను చంపిన భర్త ఆత్మహత్య



గంగిరెడ్డి మృతదేహం

రామకుప్పం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో భార్యను చంపేసి.. జైలుకెళ్లాడు. తిరిగొచ్చాక అందరూ ఏహ్యభావంతో చూస్తారని కుమారుల వద్ద బాధపడ్డాడు. చివరకు ఆమె సమాధి వద్దే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రామకుప్పం మండలంలోని బైపరెడ్లపల్లెకు చెందిన గంగిరెడ్డి (46), సుజాత దంపతులకు ఇద్దరు కుమారులు. ఈ కుటుంబం సుమారు దశాబ్దన్నర కిందట బతుకుతెరువు కోసం బెంగళూరుకు వెళ్లింది. అక్కడ కాయగూరల వ్యాపారం చేసేవారు. సుజాత కూడా సహాయపడేది. ఏడాదిగా దంపతుల మధ్య మనస్పర్థలేర్పడ్డాయి. తరచూ గొడవ పడేవారు. ఈనేపథ్యంలో ఆరునెలల కిందట క్షణికావేశంలో సుజాతపై గంగిరెడ్డి కత్తితో దాడిచేశాడు. ఈ దాడిలో ఆమె ప్రాణాలు కోల్పోయింది. తర్వాత గంగిరెడ్డి అక్కడి పోలీస్‌స్టేషనుకు వెళ్లి లొంగిపోయాడు. ఆరు నెలలుగా జైలులో ఉన్న ఆయన శనివారం బెయిల్‌పై విడుదలై స్వగ్రామంలోని కుమారుల వద్దకు వచ్చాడు. రాత్రి కొడుకులతో కలిసి భోజనం చేశాడు. భార్యను హత్య చేశానని అందరూ ఏహ్యభావంతో చూస్తారని, ఇక బతకనని కుమారులకు చెప్పాడు. భోజనాల తర్వాత కుమారులతో కలిసి నిద్రపోయాడు. తెల్లవారుజామున మెలకువ వచ్చిన ఓ కుమారుడికి ఇంట్లో తండ్రి కనిపించలేదు. సోదరుడితో కలిసి గ్రామంలో వెతికాడు. చివరకు తల్లి సమాధి వద్ద ఉన్న చెట్టుకు తండ్రి ఉరేసుకుని మృతి చెంది కనిపించాడు. మృతుడి కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదుతో ఎస్ఐ వెంకటమోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు(పాత) కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

సింగిల్ విండోల్లో వడివడిగా కంప్యూటరీకరణ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్‌విండోల) బలోపేతంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. ఆర్థిక లావాదేవీలు, రుణ మంజూర్లు, వ్యాపార నిర్వహణలో అక్రమాలు జరగకుండా పారదర్శకంగా ఉండటానికి సింగిల్‌విండోల్లో కంప్యూటరీకరణ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 75 విండోల ఆన్‌లైన్ ప్రక్రియలో గత నెలతో తొలి దశ ముగిసింది. మొత్తం 5,04,858 మంది సభ్యులున్నట్లు గుర్తించారు. వీరిలో 3,04,050 మంది పూర్తి వివరాలు సేకరించారు. 2, 3, 4 దశల్లో ప్రీ మైగ్రేషన్, పేరలల్ రన్, గోల్ లైవ్ ప్రక్రియను ఈ నెలాఖరులో పూర్తి చేయనున్నారు. మిగిలిన 2,00,808 మంది సభ్యుల వివరాలు అసమగ్రంగా ఉండటంతో వాటి పరిశీలనను జనవరి నుంచి మూడు నెలల్లో పూర్తి చేయనున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరిలు రోజువారీ ప్రోగ్రెస్‌ను పర్యవేక్షిస్తున్నారు.



ఆన్‌లైన్ ప్రక్రియలో నిమగ్నమైన సిబ్బంది

పూర్తయిన ఐదు విండోల ప్రీమైగ్రేషన్ ప్రక్రియ

ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో అగరమంగళం (విజయపురం), అరగొండ (తవణంపల్లె), చెర్లోపల్లె(పుత్తూరు), పరమేశ్వరమంగళం (పుత్తూరు), తిమ్మినాయుడుపాళ్యం (తిరుపతి అర్బన్) సింగిల్ విండోల్లోని సభ్యుల సమగ్ర వివరాలు, అప్‌డేషన్ ప్రక్రియ పూర్తయ్యింది.

ఆన్‌లైన్‌లో సభ్యుల సమగ్ర సమాచారం

సభ్యుల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. విండోలు ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లింపులు, పెట్టుబడులు, నిల్వ చేసిన డిపాజిట్లు, బకాయిలు, సింగిల్ విండోలు సంవత్సరాల వారీ తయారు చేసిన ఆడిట్ రిపోర్టు ఆధారంగా ప్రాథమికంగా అప్‌డేట్ చేస్తున్నారు. ఈ ప్రక్రియను విండో సీఈవో, సహకార శాఖ ఆడిటర్, బ్యాంకు సూపర్‌వైజర్‌తో కూడిన ప్రీ మైగ్రేషన్ బృందం చేస్తున్నది. నేషనల్ లెవల్ ప్యాక్స్ సాఫ్ట్‌వేర్ వెంచర్ వారిచే ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుంది.

టీడీపీ సభ్యత్వ నమోదులో 'కుప్పం'ది రెండో స్థానం

కుప్పం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం రెండో స్థానంలో నిలిచింది. పార్టీ అధిష్ఠానం ఆదివారం ఉదయానికి టాప్ 20 స్థానాల్లో నిలిచిన నియోజకవర్గాలను ప్రకటించింది. ఈ జాబితాలో 1,00,005 మంది సభ్యులతో కుప్పం.. రెండో స్థానం దక్కించుకుంది. సాయంత్రానికి సభ్యత్వం సంఖ్య 1,00,252కు పెరిగింది. ఓటర్ల సంఖ్య, సభ్యత్వ నమోదును అనుసరించి కుప్పం మున్సిపాలిటీ 2.75 శాతం సభ్యత్వంతో మొదటి స్థానంలో ఉండగా, రూ.1.92 శాతంతో రామకుప్పం మండలం చివరిస్థానంలో నిలిచింది. గుడుపల్లె 2.58, శాంతిపురం 2.39, కుప్పం మండలం 2.01 శాతం సభ్యత్వాలతో రెండు, మూడు, నాల్గవ స్థానాల్లో నిలిచాయి. నియోజకవర్గంలో మొత్తం 2,25,341 మంది ఓటర్లున్నారు. సుమారు 50శాతం మంది ఓటర్లు ప్రస్తుతం టీడీపీ సభ్యులైనట్లయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం కనీసం 1.50 లక్షల సభ్యత్వం చేయాలని పార్టీ శ్రేణులకు లక్ష్యం విధించారు. ఈ లక్ష్యాన్ని కూడా అధిగమించగలమన్న ధీమా ప్రస్తుతం కుప్పం టీడీపీ శ్రేణుల్లో కనిపిస్తోంది.

విషాదయాత్ర

● ఈత కొడుతూ టీడీపీ నాయకుడి మృతి

● అడవిపల్లె రిజర్వాయర్‌లో ఘటన



షఫి అల్లా (ఫైల్ ఫొటో)

పీలేరు/కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విహార యాత్ర కాస్తా విషాదంగా మారిన సంఘటన ఆదివారం అన్నమయ్య జిల్లాలోని కేవీ పల్లె మండలం అడవిపల్లె ప్రాజెక్టు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ తురకపేటకు చెందిన టీడీపీ నాయకుడు, వాటర్‌షెడ్ చైర్మన్ అయిన జీఎం షఫిఅల్లా (44) ఆదివారం తన కుటుంబసభ్యులతో విహారయాత్రగా కేవీపల్లె మండలం అడవిపల్లె రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. రిజర్వాయర్‌లో ఈత కొడుతుండగా షఫిఅల్లాకు మునిగిపోయాడు. గమనించిన కుటుంబీకులు కేకలు పెట్టగా స్థానికులొచ్చి అతడిని ఒడ్డుకు చేర్చారు. అక్కడినుంచి పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కేవీపల్లె ఎస్ఐ చిన్నరెడ్డెప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతికి ముందే రంకెలేసిన కోడెగిత్తలు



● పుచ్చలవారిపల్లెలో జల్లికట్టు

● పోలీసుల రాకతో మధ్యలో నిలిపివేత

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ముందే పుచ్చలవారిపల్లెలో కోడెగిత్తలు రంకెలేశాయి. పులిచెర్ల మండలం రాయవారిపల్లె పంచాయతీ పుచ్చలవారిపల్లెకి ఆదివారం ఉదయం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పశువులు చేరుకున్నాయి. ఎద్దుల కొమ్ములకు పలకలు, వివిధ పార్టీల నాయకుల ఫొటోలు, వస్త్రాలు, బెలూన్లు కట్టి అల్లెలోకి వదిలారు. వీటిని నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు. జల్లికట్టు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో పుచ్చలవారిపల్లెకి చేరుకున్నారు. అక్కడ ఉన్న యువకులు, గ్రామస్తులను చెదరగొట్టడంతో జల్లికట్టు మధ్యలోనే ఆగిపోయింది.

నీవానది మిగులు జలాలు సముద్రం పాలేనా?

● చెరువుల అనుసంధానం పూర్తికాక పోవడమే కారణం

● కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

నీవానది మిగులు జలాలు ఏళ్ల తరబడి సముద్రం పాలవుతున్నాయి. దీనికి పరిష్కార మార్గంగా చెరువుల అనుసంధానం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. టీడీపీ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలు ఈ పనులను పట్టించుకోలేదు.

- గంగాధరనెల్లూరు, ఆంధ్రజ్యోతి



గంగాధరనెల్లూరు బ్రిడ్జి దగ్గర పాత తారురోడ్డుపై ప్రవహిస్తున్న నీవానది (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని (వేపంజేరి నియోజకవర్గంగా ఉన్నపుడు) పెనుమూరు మండలం కలవకుంట వద్ద సుమారు 30 ఏళ్లకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా నారా చంద్రబాబు హయాంలో ఎన్టీఆర్ జలాశయాన్ని నిర్మించారు. ఈ జలాశయం నిండినప్పుడు వదిలే మిగులు జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నాయని ఈ ప్రాంత రైతులు, టీడీపీ నాయకులు అప్పట్లో చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. దీనికోసం గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాల్లోని చెరువుల అనుసంధానం చేయించాలని విన్నవించారు. రైతులకు సాగునీటితోపాటు ప్రజల తాగునీరుకు ఇబ్బందులు తప్పుతాయని తెలిపారు. ఇదే అంశాన్ని గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లెలో జరిగిన జన్మభూమి గ్రామసభలో అప్పటి చిత్తూరు ఎంపీ రామకృష్ణారెడ్డి ప్రస్తావించగా, సీఎంగా చంద్రబాబు స్పందించారు. రూ.కోటి నిధులను విడుదల చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవడం, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సీఎంలుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పదవిలో కొనసాగారు. తర్వాత పదేళ్లపాటు చెరువుల అనుసంధానం పనులు ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. రాష్ట్ర విభజన జరిగాక తిరిగి నవ్యాంధ్రలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో చెరువుల అనుసంధాన పనులకు మరో పర్యాయం శ్రీకారం చుట్టి పెనుమూరు మండలంలోని రెండు చెరువుల కాల్వలకు నిధులు మంజూరు చేయడంతో ఆ పనులు మాత్రం పూర్తయ్యాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ పరాజయం చెందడం.. వైసీపీ అధికారంలోకి రావడం తెలిసిందే. ఈ ఎన్నికల ప్రచారంలో చెరువుల అనుసంధానం పనులకు తొలి ప్రాధాన్యం ఇస్తానని వైసీపీ తరఫున గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన నారాయణస్వామి ఊదరగొట్టారు. తీరా ఎమ్మెల్యేగా గెలిచి, డిప్యూటీ సీఎం కూడా అయ్యారు. డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారిగా గంగాధరనెల్లూరుకు వచ్చినపుడు ఆరునెలల్లో నిధులు మంజూరు చేయించి, రెండేళ్లలో చెరువుల అనుసంధానం పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. చివరకు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. పైగా చంద్రబాబుపైనే బురద జల్లుతూ కాలం గడిపేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో రావడం, చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతోపాటు 30 ఏళ్లపాటు టీడీపీ ఎమ్మెల్యే గెలవనిచోట ఈసారి డాక్టర్ థామస్ గెలుపొందారు. ఈ నేపథ్యంలో చెరువుల అనుసంధానం పనులపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఉదయం నుంచి వేలాదిగా భక్తులు స్వామి దర్శనార్థం విచ్చేశారు. దీంతో క్యూలైన్లు పూర్తిగా నిండి పోయాయి. స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది.



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఆరోగ్య సిరి.. ఉసిరి

ఓసారి సాగు చేస్తే 40 ఏళ్లవరకు దిగుబడి ● విజయపురంలో విస్తారంగా సాగు



విజయపురం మండలం శ్రీహరిపురంలోని ఉసిరి తోట, (ఇన్‌సెట్లో) ఉసిరి కాయలు

ఉసిరిలో ఔషధ గుణాలు ఎక్కువన్న విషయం అందరికీ తెలిసిందే. అలాంటి ఉసిరి పంటను కొందరు రైతులు సాగు చేస్తూ మంచి ఆదాయాన్ని గడిస్తున్నారు. పైగా ఓసారి సాగు చేస్తే 40 ఏళ్లపాటు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

తొలుత ఐదెకరాల్లో..

20 ఏళ్ల కిందట తమిళనాడుకు చెందిన న్యాయవాది తొలుత విజయపురం మండలంలోని శ్రీహరిపురంలో ఐదెకరాల్లో సాగు చేశారు. మూడేళ్లలోనే ఆశించిన దిగుబడి రావడంతో ఆయన ఏకంగా 15 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

200 ఎకరాల్లో సాగవుతోంది

ఉసిరిని విజయపురం మండలంలోని మిట్టూరు, శ్రీహరిపురం, నారపరాజు కండ్రిగ, నగరి మండలం కాకవేడు ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. టన్ను ఉసిరి డిమాండ్‌ను బట్టి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ధర పలుకుతుంది.

ఎకరాకు 200 మొక్కలు

ఎకరాకు సుమారు 200 మొక్కలు అవసరం. ఈ మొక్కలను తమిళనాడులోని తంజావూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

మూడో ఏడాది నుంచి దిగుబడి

మొక్క నాటాక మూడో ఏడాది నుంచి పంట దిగుబడి మొదలవుతుంది. సంవత్సరానికి రెండు పర్యాయాలు వస్తుంది. చెట్టు పెరుగుదలనుబట్టి ఎకరాకు దిగుబడి నాలుగు నుంచి ఏడు టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఉసిరి నీటి ఎద్దడిని తట్టుకుంటుందని, చీడపీడలు, తెగులు ఎక్కువగా ఆశించదని.. రైతులు చెబుతున్నారు.

- విజయపురం, ఆంధ్రజ్యోతి

మార్కెటింగ్ కల్పించాలి



ఉసిరి పంటకు మార్కెటింగ్ వసతిని ప్రభుత్వం కల్పించాలి. విజయపురం మండలం ఉద్యాన పంటలు సాగు చేయడానికి అనువుగా ఉంది. అధికారులు ఉసిరిని ఎగుమతి చేయడానికి రైతులకు సాయం చేయాలి.

- చిన్నబ్బరాజు, రైతు, శ్రీహరిపురం

'డీఆర్సీ'లో ఎవరేమన్నారంటే..

చిత్తూరులో ఆదివారం డీఆర్సీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పలు అంశాలను ప్రస్తావించారు.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

రైతులకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇవ్వాలి



వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని వినియోగించేలా రైతులకు శిక్షణ ఇవ్వాలి. పంటల బీమాపై అవగాహన పెంచాలి. కేంద్ర ప్రభుత్వ పథకాల కేటాయింపుల్లో జిల్లాకు మేలు చేకూరుస్తా. టర్మ్‌లోన్ పంపిణీలో బ్యాంకర్లు వెనుకబడి ఉండటం శోచనీయం. జిల్లాలో మామిడి గుజ్జు సుమారు 6 నుంచి 7 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్న నిల్వలను తరలింపు విషయమై ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రితో మాట్లాడతా.

- ఎంపీ ప్రసాదరావు

పీజీఆర్ఎస్ అర్జీలను త్వరగా పరిష్కరిస్తున్నాం



పీజీఆర్ఎస్ ద్వారా 20వేల అర్జీలు అందాయి. వీటిని త్వరగా పరిష్కరిస్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో అందే ప్రతి అర్జీని అక్కడికక్కడే పరిష్కరిస్తాం. ప్రభుత్వం 2,500 ఎకరాల వరకు మల్బరీసాగుకు అవసరమయ్యే మెటీరియల్ సబ్సిడీ రూపంలో ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఎంపీ తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నా.

- కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పంలో సెరికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయించండి



కుప్పం నియోజకవర్గంలో సిల్క్ బోర్డు ద్వారా సెరికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఏర్పాటుకు ఎంపీ కృషి చేయాలి. ఇండో ఇజ్రాయల్ అనుబంధంతో రూ.10 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని కుప్పంలో ఏర్పాటు చేశాం. స్కోచ్ అవార్డు లభించింది. ఉద్యానశాఖలో సిబ్బంది సంఖ్యను పెంచాలి. అర్హులైన సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకుంటే పంటల అభివృద్ధికి మంచి ఫలితం వస్తుంది. కుప్పం తదితర ప్రాంతాల్లో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా జిల్లా కేంద్రానికి తప్పుడు సమాచారం ఇస్తున్నారు.

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

మామిడి బోర్డు ఏర్పాటు చేయాలి



ప్రస్తుత టెక్నాలజీ మెరుగ్గా ఉంది. అయినా రైతులకు కొత్త పథకాల గురించి అవగాహన కల్పించాలి. మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని శాసనసభలో కోరా. జిల్లాలో మామిడి బోర్డును ఏర్పాటు చేయాలి. జిల్లాలోనే ఏకైన షుగర్ ఫ్యాక్టరీ తక్కువ ధర చెల్లించి రైతుల్ని అన్యాయం చేస్తుంది. ప్రహరీలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు రాత్రయితే పానశాలలుగా తయారవుతున్నాయి.

- జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలి



ప్రతిశాఖ ద్వారా అమలు చేసే కార్యక్రమాలపై ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వండి. పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు తనిఖీ చేయాలి.

- చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్

అటవీ అధికారుల తీరు సరిగ్గా లేదు



నల్లబెల్లంపై ఆంక్షలతో రైతులు చెరకు పంటను తగ్గించేశారు. ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ బదులు ఎస్‌హెచ్‌జీలకు స్థానం కల్పించాలి. పూతలపట్టు నియోజకవర్గంలో అటవీశాఖ అధికారులు తీరు సరిగ్గా లేదు. 72 గ్రామాలు అడవికి దగ్గరగా ఉండటంతో లోనికి వెళ్లకుండా అధికారులు అన్యాయంగా కేసులు పెడుతున్నారు.

- పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్

డెయిరీ ఏర్పాటుకు వెయ్యి గోవులిస్తా

బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్

పుంగనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుమల డెయిరీ ఏర్పాటుకు వెయ్యి పశువులతోపాటు 22 ఎకరాల భూమి సేకరించి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయావ్ తెలిపారు. ఈమేరకు తాను సీఎం చంద్రబాబుకు లేఖ రాశామన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. టీటీడీ ఆధ్వర్యంలో డెయిరీ ఏర్పాటు చేస్తే తాను 1000 పాడిఆవులు, మరో లక్ష గోవులు సేకరించే బాధ్యత తీసుకుంటానని గతంలో లేఖ రాసినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఒకేచోట లక్ష గోవులు కుదరకపోతే జిల్లాల వారీగా 5వేల పశువుల చొప్పున ఏర్పాటు చేయవచ్చన్నారు. జిల్లాలోని 22ఎకరాలను టీటీడీ గోశాలకు ఉచితంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో టీటీడీ లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని ప్రజలకు అనుమానం కలిగేలా కూటమి ప్రభుత్వం ప్రచారం చేసిందన్నారు. ఆ విషయంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. అన్ని జిల్లాల్లో డెయిరీ ఏర్పాటుకు భూమిని సేకరించే బాధ్యత తీసుకుంటానన్నారు. సీఎంతో మాట్లాడటానికి తనకు అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ

చౌడేపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. తొలుత అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.





ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ, దర్శనం కోసం వేచివున్న భక్తులు

వరసిద్ధుడి అన్నదానానికి రూ.5.90 లక్షల విరాళం





విరాళ పత్రాన్ని దాత అశోక్‌కుమార్‌కు అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి, చెక్కును అందజేస్తున్న దాత జయప్రకాష్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆదివారం పలువురు దాతలు రూ.5,90,000 విరాళంగా అందించారు. అన్నదాన కార్యక్రమానికి చెన్నైకి చెందిన దాతలు అశోక్‌కుమార్,కల్యాణి రూ.1,70,000, బెంగళూరుకు చెందిన జయప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానానికి రూ.2,00,116, గోసంరక్షణ ట్రస్టుకు 2,20,116 చెక్కు రూపంలో విడివిడిగా అందించారు. దాతలకు ఏఈవో రవీంద్రబాబు స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

3 కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళ్యం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. అరగొండ ఫ్లైఓవర్ వద్ద వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. తవణంపల్లె మండలం క్రిష్ణాపురానికి చెందిన నాగయ్య కుమారుడు రాజశేఖర్, రవి కుమారుడు బాలాజీలుగా గుర్తించారు. వారిని తనిఖీ చేయగా, 15వేల విలువ చేసే మూడు కిలోల గంజాయి బయటపడింది. దాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, వళ్ళెమ్మ, సిబ్బంది కిరణ్, నీరజాక్షులు, మోహన్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని అవినీతి!

- సస్పెన్షన్లు తప్ప వీగిపోతున్న కేసులు
- నేడు అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం

ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ తహసీల్దారు క్యాడర్ అధికారి పరమేశ్వరస్వామిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు నడుస్తుండగానే వారం కిందట ఆయనకు ఎర్రావారిపాలెం తహసీల్దారుగా పోస్టింగ్ వచ్చింది. దీని వెనుక రాజకీయ పలుకుబడి ఉందన్న విమర్శలున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తూ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై మదనపల్లె మాజీ ఆర్డీవో మురళిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆయన ఇల్లు, బంధువులు, స్నేహితుల ఇళ్లపై దాడులు చేసి భారీ మొత్తంలో ఆస్తుల రికార్డులు, నగదు, బంగారు నగలు ఇతరత్రా పత్రాలు సీజ్ చేశారు.

డిసెంబరు 9. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం. ఏటా ఈ కార్యక్రమం జరుపుకొంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. లంచం తీసుకుంటున్న అధికారులనూ ప్రజల ఫిర్యాదుతో పట్టుకుంటున్నారు. అయినా, అవినీతి ఆగడం లేదు. రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు, ఓటు రాజకీయాలతో కేసులు పక్కదారి పడటమే కారణమన్న విమర్శలున్నాయి. గత రెండేళ్ల కాలంలో దాదాపు 8 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో పట్టుబడిన అధికారులను సస్పెండు చేస్తున్నారు. అయితే ఏసీబీ కేసుల పరిస్థితిని పరిశీలిస్తే అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన వారిలో కొందరికి మాత్రమే శిక్షలు పడుతుండగా మరికొందరు ఎలాంటి చర్యలు లేకుండా మళ్లీ ఉద్యోగంలో చేరుతున్నారు. మరికొందరిపై విచారణకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంలేదు. లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న కొన్ని కేసుల్లో బాధితులకు సర్దిచెప్పడం లేదా ఒత్తిడి తీసుకొచ్చి కోర్టుల్లో సాక్ష్యం చెప్పనీయకుండా చేసి అవినీతి అధికారులు బయటపడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అవినీతి కేసుల్లో పట్టుబడిన వారిపై చర్యలు ఉంటేనే అవినీతి తగ్గే అవకాశాలున్నాయి.

రెండు రకాల కేసులు

సాధారణంగా ఏసీబీ అధికారులు రెండు రకాల కేసులు నమోదు చేస్తారు. ఇందులో మొదటిది లంచం అడుగుతున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. సంబంధిత ఉద్యోగులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం. వీటిని ట్రాప్ కేసులంటారు. రెండోది ఆదాయానికి మించి ఆస్తుల కేసు. అవినీతి చేసి ఆస్తులు సంపాదించినట్లు ఫిర్యాదులు వస్తే.. ఏసీబీ అధికారులు మొదట వివరాలు సేకరిస్తారు. ఆ తర్వాత వారి ఇళ్లు, బంధువులు, బినామీల ఇళ్లపై ఒకేసారి దాడులు చేస్తారు. డబ్బు, పత్రాలు, బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకుంటారు. ఆ తర్వాత వారి జీతం, ఇతర అధికారిక ఆదాయాలు అన్నీ లెక్కవేసి అంతకంటే ఎక్కువ ఉంటే అది ఎలా వచ్చిందో విచారణ జరుపుతారు. సరైన కారణాలు చెప్పకుంటే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని కేసు పెడతారు. ఆ ఆదాయానికి సంబంధించి సాక్ష్యాధారాలు చూపితే కేసు ఉండదు. స్వాధీనం చేసుకున్న వాటిని వెనక్కి ఇచ్చేస్తారు. - తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఫిర్యాదు చేస్తేనే ప్రయోజనం

వివిధ పనులకోసం అధికారులు లంచం కోసం వేధిస్తే తమకు ఫోను చేసి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. 24 గంటలూ సేవలు అందుబాటులో ఉండే అవినీతి నిరోధక శాఖ హెల్ప్ లైన్ నెంబరు 1064కు.. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏసీబీ అదనపు ఎస్పీ 94404 46130, డీఎస్పీ 94404 46190, కార్యాలయ ఫోన్ నెంబరు 0877-2220252కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. అవినీతిని అరికట్టడం అనేది ఓ సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రజలు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరుతున్నారు. ఇక, అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే మిగతా వారు వెనకడుగు వేస్తారు.

ఘనంగా మహంతు ఉత్సవం



తిరుచానూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో పద్మావతి అమ్మవారికి ఆదివారం మహంతు ఉత్సవం జరిగింది. అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని పద్మసరోవరం సమీపంలోని హథీరాంజీ మఠంలోని ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. మఠం అధికారులు సమర్పించిన సారెతో అమ్మవారికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు పల్లకిని అధిరోహించి భక్తులను సాక్షాత్కరించారు. పల్లకీలో ఊరేగింపుగా సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు. అంతకు ముందు మఠం అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబాస్కరనాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సుమారు 29 వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,496మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,860మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,390మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 908, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 268మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 223మంది, రూ.5 వేల టిక్కెట్ల ద్వారా 54మంది పూజలు చేయించుకున్నారు. - శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

తిరుపతిలోని హోటళ్లకు

మళ్లీ బాంబు బెదిరింపు

● మెయిల్ రావడంతో అప్రమత్తమైన పోలీసులు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్స్ మొదలయ్యాయి. రెండు నెలల కిందట నాలుగైదు హోటళ్లకు వరుసగా బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా తిరుపతిలోని రాజ్‌పార్క్ హోటల్‌లో ఇంప్రువైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైడర్లు ఏర్పాటు చేశామని త్వరలో అవి పేలతాయంటూ హోటల్‌కు మెయిల్‌కు, మేనేజర్ సుశాయ్ వాట్సాప్‌కు ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో హెచ్చరికలు వచ్చాయి. ఈ మెయిల్‌ను అలిపిరి సీఐ రాంకిషోర్‌కు పంపారు. డీఎస్పీ వెంకటనారాయణ ఆదేశాల మేరకు సీఐ రాంకిషోర్ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగార్జున రెడ్డి, లోకేష్‌బాబు, సిబ్బంది. బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లు హోటల్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. వంటగదులు, యాత్రికులు బస చేసిన గదులు, డైనింగ్ హాళ్లు, వెయిటింగ్ హాళ్లు, రిసెప్షన్ కౌంటర్లు, మేనేజర్ గదిని తనిఖీ చేశారు. ఎక్కడా బాంబులు లేవని నిర్ధారించారు. ఈ బెదిరింపు మెయిల్ కూడా ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు.

ఇంకా జగనే సీఎం అట!

● సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎండీయూ వాహనంపై తొలగిన బొమ్మ



ఉదయం జగన్ బొమ్మతో..



సాయంత్రం తొలగిన బొమ్మ

కూటమి ప్రభుత్వం ఏర్పాటై.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఆరు నెలలు దాటింది. అయినా పిచ్చాటూరు మండలం ఎస్ఎస్‌టీ పేటలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న వాహనంపై మాత్రం జగన్ బొమ్మే ఉంది. ఆదివారం ఉదయం రేషన్ సరుకుల పంపిణీ సందర్భంగా ఈ విషయం బయటపడింది. జగన్ బొమ్మ ఇంకా తొలగించకుండా గ్రామాలకు వెళ్లి సరకులు పంపిణీ చేస్తుండటం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై తహసీల్దార్ రమేష్‌బాబు స్పందించారు. సాయంత్రానికంతా జగన్ బొమ్మను తొలగించారు. కానీ, నవరత్నాల లోగో మాత్రం అలాగే ఉంది.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి

మాజీ సైనికోద్యోగుల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవులు

పలమనేరు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికోద్యోగులు, కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి తమ కార్యాలయం పనిచేస్తుందని జిల్లా సైనిక సంక్షేమ అధికారి రాఘవులు పేర్కొన్నారు. ఆదివారం పలమనేరులో జరిగిన మాజీ సైనికోద్యోగుల సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. గుర్తింపుకార్డులు జారీ, ఇళ్లపన్ను మినహాయింపు, కార్యాలయం భవనానికి స్థలం కేటాయింపు, మద్యంపై టాక్సు తగ్గింపు, మాజీ సైనికులకు భూకేటాయింపులు, తదితర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం పలమనేరు అధ్యక్షుడె పయని, సంఘ కార్యదర్శి గిరిధర్, ఎన్జీఓ సంఘ పలమనేరు అధ్యక్షులు ఆనందబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, వెల్ఫేర్ ఆర్గనైజర్ వినాయకరెడ్డి, పాల్గొన్నారు. గంగవరం సమీపంలో నిర్మించిన మాజీ సైనికులసంక్షేమ కార్యాలయంలో జరిగిన సమావేశానికి కూడా జిల్లా సైనికుల సంక్షేమ అధికారి హాజరయ్యారు.

అధ్వానంగా బేలుపల్లె రహదారి



బైరెడ్డిపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బేలుపల్లెకు వెళ్లే రహదారి వర్షంపడితే చిత్తడిగా మారుతోంది. కొంతదూరం వరకు సీసీరోడ్డు వేశారు. మిగిలిన రోడ్డుకు సీసీరోడ్డు వేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. శల్యవైద్యం కోసం నిత్యం పలువురు బేలుపల్లెకు వస్తుంటారు. గ్రామ సమీపంలో పట్నపల్లె కల్యాణ వెంకన్న అలయానికి భక్తులు వస్తుంటారు. వీరంతా ఈ మార్గంలో అవస్థలు పడుతున్నారు. బెల్లంమడుగు రహదారి, బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం వెళ్లే రహదారి, కొలమాసనపల్లె నుంచి నెల్లిపట్లకు వెళ్లే రహదారిలో తారు రోడ్డు దెబ్బతింది. గుంతలమయమైంది.

మామిడి, టమోటా బీమాకు 15వ తేదీ గడువు

సదుం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో ప్రభుత్వం మామిడి, టమోటా పంటలకు బీమా సదుపాయం వర్తింపజేస్తున్నట్లు సర్కిల్ ఉద్యానవన అధికారి సంతోషి కుమారి తెలిపారు. ఎకరా మామిడికి రూ.1750ప్రీమియం, టమోటాకు ఎకరానికి రూ.1250 ప్రీమియం చెల్లించాలన్నారు. ఈనెల 15లోపు బీమా చేసుకోవాలని ఆమె కోరారు.

కమ్యుటేషన్ రికవరీ నిలుపుదల ఉత్తర్వులపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న గురురాజారావు

పలమనేరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): కమ్యుటేషన్ రికవరీ నిలుపుదల ఉత్తర్వులపై రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు హర్షం వ్యక్తంచేశారు. ఆదివారం పలమనేరులో జరిగిన నియోజకవర్గ రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 15 ఏళ్ల రికవరీలపై రిటైర్డు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించాన్నారు. 2010లో బేసిక్ పెన్షన్‌లో 8.4 శాతానికి తగ్గించి 40 శాతం మొత్తాన్ని రిటైర్డు ఉద్యోగులకు కమ్యుటేషన్ మొత్తాలను అందించారన్నారు. ఈనేపథ్యంలో రిటైర్డు ఉద్యోగుల కమ్యుటేషన్ రికవరీ కాలపరిమితిని తగ్గిస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం సానుకూలంగా ఖజానా శాఖ ద్వారా ఉత్తర్వులు పంపిందన్నారు. సమావేశంలో పెన్షనర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో ల్యాబ్‌కు రూ.లక్ష విరాళం



దాత డాక్టర్ మురళినాయుడును సన్మానిస్తున్న హెచ్‌ఎం ఎంఈవో కేశవరెడ్డి

చౌడేపల్లె, డిసెంబరు8:(ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో ల్యాబ్ కోసం ఓ దాత రూ.లక్ష విరాళమిచ్చినట్లు ఎంఈవో కేశరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ల్యాబ్ పరికరాల కొనుగోలుకు దాత డాక్టర్ మురళినాయుడు విరాళం ఇచ్చారన్నారు. ఆయన మనుమడు రూత్విక్ పేరు సైన్స్ ల్యాబ్‌కు పెట్టామన్నారు. దాత మురళినాయుడు శనివారం ల్యాబ్ ప్రారంభించారు. దాతను ఉపాధ్యాయులు శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జేఏసీలో పదవి పొందిన తహసీల్దారుకు సన్మానం



హుస్సేన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సదుం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ(అమరావతి) జిల్లా చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన తహసీల్దారు ఎస్‌ఎం హుస్సేన్‌ను మండల టీడీపీ నాయకులు ఆదివారం సన్మానించారు. మండలంలో సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకులు తహసీల్దారుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ రెడ్డిప్రసాద్ రెడ్డి, నాయకులు ఈశ్వర రెడ్డి, సహదేవ, కేశవరెడ్డి, జోగా ప్రసాద్ రెడ్డి, జ్యోతీశ్వర రెడ్డి, కృష్ణయ్య శంకర్ రై, అమరనాథ్ గౌడ్, నారాయణ గౌడ్, పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 20మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు రూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల్లో 20మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికైనట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధి డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం స్థానిక బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజీ వైద్యులు 60మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 20మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల రెండవ ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్ చేయించి ఉచితంగా భోజన, రవాణా, మందులు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మనిపాల్‌రెడ్డి, సుధాకర్‌రావు, త్రిమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా సౌకర్యం



టీడీపీ సభ్యత్వాలు చేయిస్తున్న గాజుల రమణ

పుంగనూరు రూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ రూ. 5లక్షల బీమా వర్తిస్తుందని రాజంపేట పార్లమెంటు బీసీసెల్ కార్యదర్శి గాజుల రమణ పేర్కొన్నారు. ఆదివారం నేతిగుట్లపల్లె పంచాయతీ అక్కింవారిపల్లెలో టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తలకు గుర్తింపు లభించి పదవులు పొందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, కుమార్, రాజేశ్, రెడ్డెప్ప, శేఖర్ పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం



గంగవరం, డిసెంబరు8, (ఆంధ్రజ్యోతి): జీడిమాకులపల్లెలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి జ్ఞానవేదిక(పలమనేరు) ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. జ్ఞానవేదిక పలమనేరు అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ.. మార్గశిర మాసం (ధనుర్మాసం) ప్రారంభం సందర్భంగా భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. దైవభక్తితో గ్రంధపఠనం, జ్ఞానంలో ఉండాలని సూచించారు. ఇంటింటికి తిరిగి భగవద్గీత ప్రాముఖ్యతను వివరించారు. సమితి సభ్యులు బాలాజి, జ్యోతి, రెడ్డెమ్మ, రేఖకళ్యాణి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

పలమనేరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : మారుమూరు సమీపంలో ఆటో ఢీకొని క్రిష్ణప్ప(60) అనే వ్యక్తి మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ సమీపంలోని బంగారుపేటకు చెందిన ఇతను మారుమూరు వద్ద కూలి పనులకు వచ్చాడు. ఈనేపథ్యంలో ఆదివారం రోడ్డుపై వెళ్తున్న క్రిష్ణప్పను ఆటో ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. క్రిష్ణప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయ భూముల కౌలు వేలం వాయిదా

పలమనేరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు వేలం పాట వాయిదా పడింది. ఆలయ కార్యనిర్వాహక అధికారి కమలాకర్ ఈ విషయం తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో దేవదాయ శాఖ అధికారులు పాల్గొంటున్నందున వేలం పాట వాయిదా వేశామన్నారు. వేలం ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయం తదుపరి తెలియజేస్తామని వివరించారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



జావీద్(ఫైల్‌ఫొటో)

రామకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బతుకుతెరువు కోసం బెంగళూరులో ఉంటున్న ఓ యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల కథనం మేరకు....రామకుప్పానికి చెందిన జావిద్(26) ఆరేళ్ల క్రితం బెంగళూరుకు వలస వెళ్లి ద్విచక్రవాహనాల రిపేరు షాపు నిర్వహించేవాడు. ఎనిమిది నెలల క్రితం పెళ్లి చేసుకున్నాడు. ఈనేపథ్యంలో శనివారం ద్విచక్రవాహనానికి గాలి పట్టేందుకు కంప్రెషర్‌ను ఆన్ చేయబోయి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

కుప్పంలో నేడు గ్రీవెన్స్ డే

కుప్పం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల సచివాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించి, పరిష్కారాలు చూపుతామన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

బైరెడ్డిపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. శిబిరంలో వైద్యనిపుణులు 60మందికి కంటిపరీక్షలు చేశారు. ఇందులో 29మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. శిబిరానికి వచ్చిన వారందరికీ నిర్వాహకులు భోజనసౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాసులు, నిర్వాహకులు చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు వంద మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు వంద మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 2897మంది విద్యార్థులకు గాను 2797 మంది హాజరు కాగా, వంద మంది గైర్హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీ సోమవారం ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో కీని పరిశీలించి అభ్యంతరాలను ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సూచించారు.

కమ్యూనిటీ హాలు ప్రారంభం

నగరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏకాంబరకుప్పంలో వీవర్స్ కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి హయాంలో ఏకాంబరకుప్పం వాసులు కమ్యూనిటీహాలును కోరారని చెప్పారు. నాడు అనివార్య కారణాల వలన ఆగిపోయిన ఈ కమ్యూనిటీ హాలును నేడు తన చేతులమీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే చెప్పారు.

మా ఇళ్లకు పన్నులేయండి మహాప్రభో..!

● ఏళ్ల తరబడి నక్కబండ కాలనీవాసుల అభ్యర్థన ● మున్సిపాలిటీలో విలీనమైనా ప్రాథమిక వసతులు మృగ్యం



పుంగనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆస్తి, కొళాయి పన్నులు ఖరారు చేస్తే చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మున్సిపల్ పరిధిలోని నక్కబండకాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2004లో నాటి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సహకారంతో పట్టణ శివార్లలోని నక్కబండలో పెద్దమఠానికి చెందిన భూమి 41.51ఎకరాలు,2005లో 24.85 ఎకరాలను ఇళ్ల కాలనీ కోసం రూ.10.35 లక్షలకు ప్రభుత్వానికి విక్రయించారు. తర్వాత నక్కబండ కాలనీలో అనేకమంది రెండువేలకు పైగా ఇళ్లు నిర్మించుకున్నారు. ఇందులో పలువురు పట్టాలను అమ్మేసుకున్నారు. కొందరు అధికారులను ప్రసన్నం చేసుకుని పట్టాలు మార్పులు చేసుకున్నారు. అయితే అర్హులైన నిజమైన లబ్దిదారులు ఇంటి పన్ను చెల్లించి హక్కు పొందాలని తాపత్రయపడుతున్నారు. గతంలో ఈ ప్రాంతం గుడిసెబండ గ్రామపంచాయితీలో ఉండేది. అప్పట్లో దాదాపు 400 ఇళ్లకు, వంద ప్రైవేట్ నీటి కొళాయిలకు పంచాయతీకి పన్నులు చెల్లించేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీలో విలీనం చేసింది. అప్పటి నుంచి కౌన్సిలర్ మనోహర్, టీడీపీ నాయకులు శ్రీకాంత్ తదితరులు కాలనీలో ఇళ్లకు పన్నులు ఖరారు చేయాలని కోరుతున్నారు. పన్నులు విధిస్తే డోర్‌నెంబర్లు వస్తాయి. మున్సిపల్ రికార్డుల్లో నమోదు కావడం, కొళాయిలు వేయించడం, వివిధ రకాల పోలీసు, ఎక్సైజ్, అటవీశాఖలకు సంబంధించిన కేసుల్లో బెయిల్ మంజూరు కోసం ఆస్తి పూచికత్తుకు ఉపయోగపడుతుంది. కాలనీ మున్సిపాలిటీలో విలీనమైనా తాగునీరు సరఫరాకు సంబంధించి వాటర్‌మ్యాన్లను కూడా ఏర్పాటు చేయలేదు. కనీస మౌలిక వసతులు లేవు. కృష్ణమరెడ్డి పల్లెరోడ్డులోని మంగళంకాలనీ (పెద్దిరెడ్డి కాలనీ)లో కూడా పన్నుల ఖరారులో మున్సిపల్ అధికారులు మీనవేషాలులెక్క పెడుతున్నారు. మున్సిపల్ ఆర్‌ఐ నాగరాజ మాట్లాడుతూ చాలామంది వద్ద పట్టాలు లేవన్నారు. ప్లాట్ నంబరు స్లిప్ మాత్రమే ఉందన్నారు. పన్ను విధింపు ప్రక్రియ వేగవంతం చేస్తామన్నారు.

భూ తగాదా : ఇరువర్గాలపై కేసు

సోమల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) కందూరు పంచాయతీ ఉలవలవానికుంటకు చెందిన ఇరువర్గాల మధ్య ఆదివారం భూ వివాద నేపథ్యంలో ఘర్షణ జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదులతో కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. ఉలవలవానికుంటకు చెందిన మహబూబ్‌బాషాకు అదే గ్రామానికి చెందిన లక్ష్మీదేవి కుటుంబాల మధ్య భూ వివాదం ఉంది. ఈక్రమంలోనే పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో మహబూబ్‌బాషా, ఖరున్నిషా, సయ్యద్ బాషా, సయ్యద్ షావలీ గాయపడి కలికిరి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. లక్ష్మీదేవిని కులం పేరుతో దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

హైందవ శంఖారావం సభ జయప్రదానికి పిలుపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

సోమల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సభను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పుంగనూరు నియోజక వర్గం బీజేపీ కన్వీనర్ గన్నా మదన్‌మోహన్ బాబు కోరారు. ఆదివారం ఆవులపల్లె వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కోసం జరిగే బహిరంగ సభకు జనం తరలింపుపై ఆయన సమీక్షించారు. మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, ఆవులపల్లె సర్పంచు కోదండరాజు, గిరి, శివ, జనార్ధన్‌రావు, నాగభూషణం రాయల్, లీలాకుమార్, బాలాజీ, హరినాధ్ మల్లికార్జున పాల్గొన్నారు.

సాహిత్యం... సర్వజన హితం



గ్రంథావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోరేది కేవలం సాహిత్యం మాత్రమేనని, సాంఘీక, సామాజిక, ఆర్థిక, సమకాలిక రంగం ఏదైనా సాహిత్యం మార్గనిర్దేశం చేస్తుందని జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత గద్వాల సోమన్న రచించిన 48వ రచన తొలకరి జల్లు, కృష్ణదాస్ రచించిన కీర్తనలు, తత్వాలు-2 గ్రంథాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తొలకరి జల్లు బాలల కవితా సంపుటిని ప్రముఖ సాహితీవేత్త వి.హరి నాయుడుకు రచయిత గద్వాల సోమన్న అంకితమిచ్చారు. అనంతరం కృష్ణదాస్ రచించిన కీర్తనలు, తత్వాలు-2 గ్రంథాన్ని ఎం.ఆర్.అరుణకుమారి సమీక్ష చేయగా, తొలకరి జల్లును రచయిత పి.ఎల్.కృష్ణారెడ్డి సమీక్షించారు. గ్రంథ రచయితలను నిర్వాహకులు సత్కరించారు. హరివిల్లు లలితకళావేదిక అధ్యక్షుడు భాస్కరరెడ్డి, ట్రెజరర్ గోవిందన్, శ్యామలమ్మ, పత్తిపాటి రమేష్ నాయుడు, సహదేవ నాయుడుతో పాటు సాహితీవేత్త పాల్గొన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్

● ఎంపీ దగ్గుమళ్లను సన్మానించిన శెట్టిపారం గ్రామస్తులు



దగ్గుమళ్లను సన్మానిస్తున్న శెట్టిఫారం గ్రామస్తులు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శెట్టిపారం వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కృషితో గ్రీన్‌సిగ్నల్ లభించింది. చిత్తూరు-తచ్చూరు హైవేరోడ్డు నిర్మాణంలో భాగంగా గ బంగారెడ్డిపల్లె పంచాయతీ శెట్టిపారం గ్రామతిలకు దారి సమస్య ఏర్పడింది. అప్పట్లో ఆ గ్రామానికి చెందిన ప్రజలు మండల, జిల్లా అధికారులకు, వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీలను కలసి దారి సమస్యను పరిష్కరించాలని పలు సార్లు విన్నవించినా మోక్షం లభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామస్థులు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎంపీ కేంద్ర హైవేరోడ్స్ శాఖ మంత్రి నితిన్‌గడ్కరిని కలిసి దారి సమస్యను వివరించి వినతిపత్రం ఇచ్చారు. కేంద్రమంత్రి స్పందించి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ క్రమంలో టీడీపీ నేతతు ఆదివారం చిత్తూరులో ఎంపీ దగ్గుమళ్లను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు



పాలసముద్రం,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో నాటుసారా తరలిస్తున్న ఓ వ్యక్తిని, సారా విక్రయిస్తున్న మరో వ్యక్తిని పాలసముద్రం ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఆదివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు మధునాయుడు మండలంలోని నరసింహాపురం గ్రామానికి చెందిన పాండురంగన్ వద్ద 40 లీటర్ల సారా ప్యాకెట్లు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా ఎస్‌ఐ తన సిబ్బందితో కాపు కాచి పట్టుకున్నారు. సారా విక్రయించిన పాండురంగన్ పారిపోగా, తరలిస్తున్న మధునాయుడును అరెస్టుచేసి ద్విచక్ర వాహనాన్ని, సారాను స్వాధీన పరచుకున్నారు. అలాగే పాలసముద్రం కాలనీలో సారా విక్రయిస్తున్న రామచంద్రన్‌ను అరెస్టు చేసి, 10 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకునట్లు ఎస్‌ఐ తెలిపారు.

అందని శుద్ధజలం- తప్పని ఆర్థిక భారం



రామకుప్పం దిగువవీధిలో ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్లాంట్

రామకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శుద్ధజలం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తక్కువ ధరకు శుద్ధజలం అందించాలని 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్టీయార్ ట్రస్టు సహకారంతో కుప్పం, రామకుప్పం, గుడుపల్లె, శాంతిపురంలో మండలాల పరిధిలో 16కు పైగా శుద్ధ జలం తయారీ ప్లాంట్లను, గ్రామాల్లో 250కి పైగా డిస్ట్రిబ్యూటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. అప్పట్లో వీటి ద్వారా 20లీటర్ల వంతున శుద్ధజలాన్ని అందించేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొన్ని నెలల పాటూ శుద్ధజలం సరఫరా ఆగిపోంది. కొన్ని నెలల తర్వాత పునరుద్ధరించిన పాలకులు 20లీటర్ల ధరను రూ.5కు పెంచారు. పరిమిత సంఖ్యలోని డిస్ట్రిబ్యూటర్ ప్లాంట్‌ల ద్వారానే అందించారు. కొన్ని ప్లాంట్లలో 18లీటర్ల నీరే అందేది. అంతే కాకుండా గ్రామాల్లోని అన్ని డిస్ట్రిబ్యూటషన్ ప్లాంట్లపై ఉన్న ఎన్టీయార్, చంద్రబాబు ఫొటోలను తొలగించి, జగన్, పెద్దిరెడ్డి ఫోటోలను అంటించారు. టీడీపీ ప్రభుత్వంలో రామకుప్పం, పల్లికుప్పం, కెంచనబల్ల, వీర్నమలల్లో శుద్ధ జలం ప్లాంట్లను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో 80కి పైగా డిస్ట్రిబ్యూషన్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం రాగానే వీర్నమలలోరి ప్లాంటు మర్మతులకు గురై నిరుపయోగంగా మారింది. తర్వాత గ్రామాల్లోని 60శాతానికి పైగా డిస్ట్రిబూషన్ ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటి మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. రామకుప్పం పట్టణంలో మూడు డిస్ట్రిబ్యూషన్ ప్లాంటులుండగా ఐదేళ్లుగా దిగువ మసీదు వద్ద గల ప్లాంటు ద్వారా మాత్రమే పనిచేస్తోంది. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ ప్లాంటునే ఆశ్రయిస్తున్నారు. దీంతో సరిపడా జలాలు అందుబాటులేక అసౌకర్యానికి గురవుతున్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గం మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు శుద్ధజలాన్ని ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేస్తూ అదనపు ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోంది.

వేంకటేశ్వరస్వామి పాదాల ఆలయంలో పూజలు

సోమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుకల్యాణ మహోత్సవాల నేపథ్యంలో ఆదివారం వేంకటేశ్వరస్వామి పాదాల ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో,పచ్చని తోరణాలతో అలంకరించారు. సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, హోమాది కార్యక్రమాలు జరిగాయి. సోమవారం డాక్టర్ ప్రదీప్‌కుమార్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో స్వామివార్ల కల్యాణోత్సవం, పల్లకీ సేవలు నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు చంద్రశేఖర్, శ్యాంసుందర్, అర్చకులు వేణుగోపాల్ తెలిపారు.

బాటగంగమ్మ ఆలయంలో ..



బైరెడ్డిపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బాటగంగమ్మ ఆలయంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయపూజారి జయచంద్ర అమ్మవారికి విశేషాలంకరణచేసి పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి



సమావేశమైన దళిత సంఘం నాయకులు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అందరూ సహకరించాలని దళిత సంఘ నాయకులు కోరారు. శేషాద్రిస్వామి ఆలయంవద్ద ఆదివారం సంఘ నాయకులు సమావేశమయ్యారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఐకమత్యంగా ధృడసంకల్పంతో విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని నాయకులు కోరారు. ఈ అంశంపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఃపలువురు దళితసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆహ్వానించకపోవడం సరికాదు

రామకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బల్ల పంచాయతీ లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల సమావేశానికి తమనెవరినీ ఆహ్వానించలేదని నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి హనుమంతు ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారులు స్పందించి ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చిత్రలేఖనంలో పీఈఎస్ విద్యార్థుల ప్రతిభ

యాదమరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు సంసిధ్ క్యాంఫోర్డ్ పాఠశాల వేదికగా ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్తూరు పరిసర ప్రాంత పాఠశాలలకు చెందిన దాదాపు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో మొదటి కేటగిరిలో పీఈఎస్ పాఠశాలకు చెందిన బి.మాన్వి మొదటి బహుమతి, బి.మాన్వి రెండవ బహుమతిని కైవసం చేసుకున్నారు. రెండవ కేటగిరిలో కె.సాహితి మొదటి బహుమతి, బి.లిఖిత రెండవ బహుమతి, జె.తేజేష్ మూడవ బహుమతిని సొంతం చేసుకున్నారు. ఆర్ట్‌మాస్టర్ దినేష్, విద్యార్థులను పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు అభినందించారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్యవర్గం

నగరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరి డివిజన్ పరిధిలోని కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా షకీలా, ప్రధానకార్యదర్శిగా మురళి, వైస్‌చైర్మన్‌గా వేలాయుధం, గౌరవ అధ్యక్షుడిగా జయపాల్, ప్రచార కార్యదర్శిగా మస్తాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోపీనాథ్, అధికారప్రతినిధిగా మునిబాబు, మున్సిపాలిటీ పరిధిలో కమిటీ వైస్ చైర్మన్‌గా ప్రతాప్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

సప్తకన్నికల అమ్మవార్ల సేవలో మంత్రి, ఎమ్మెల్యే



కార్తీకదీప మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్, చల్లా రామచంద్రారెడ్డి

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దొడ్డిపల్లె సప్తకన్నికల అమ్మవార్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డిలు దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం డీఆర్సీ సమావేశానికి వచ్చిన మంత్రి రాంప్రసాదరెడ్డికి సప్తకన్నికల ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి, అమ్మవార్ల పూజలకు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఈనెల 13న ఆలయంలో నిర్వహించే కార్తీక దీప మహోత్సవం కరపత్రాలను మంత్రి రాంప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్, చల్లా రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీవర్స్ సంఘం కమ్యూనిటీ హాలు ప్రారంభం



కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబరకుప్పంలో విరాళాల సేకరణతో నిర్మించిన వీవర్స్ కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి హయాంలో ఏకాంబరకుప్పం వాసులు కమ్యూనిటీహాలును కోరారని చెప్పారు. నాడు అనివార్య కారణాల వలన ఆగిపోయిన ఈ కమ్యూనిటీ హాలును నేడు తన చేతులమీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వీవర్స్ అసోసియేషన్ సభ్యులు సమావేశం జరుపుకోవాలంటే ఈ హాలు ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. అంతకు ముందు ఆయన బుగ్గకండ్రిగలో గల అన్నేశమ్మను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

'సాహిత్యం... సర్వజన హితం'



తొలకరి జల్లు, కీర్తనలు-తత్వాలు గ్రంథావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోరేది కేవలం సాహిత్యం మాత్రమేనని, సాంఘిక, సామాజిక, ఆర్థిక, సమకాలిక రంగం ఏదైనా సాహిత్యం మార్గనిర్దేశం చేస్తుందని జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత గద్వాల సోమన్న రచించిన 48వ రచన తొలకరి జల్లు, కృష్ణదాస్ రచించిన కీర్తనలు, తత్వాలు-2 గ్రంథాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తొలకరిజల్లు బాలల కవితా సంపుటిని ప్రముఖ సాహితీవేత్త వి.హరి నాయుడుకు రచయిత గద్వాల సోమన్న అంకితమిచ్చారు. అనంతరం కృష్ణదాస్ రచించిన కీర్తనలు, తత్వాలు-2 గ్రంథాన్ని ఎం.ఆర్.అరుణకుమారి సమీక్ష చేయగా, తొలకరి జల్లును రచయిత పి.ఎల్.కృష్ణారెడ్డి సమీక్షించారు. గ్రంథ రచయితలను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో హరివిల్లు లలితకళావేదిక అధ్యక్షుడు భాస్కరరెడ్డి, ట్రెజరర్ గోవిందన్, సాహితీవేత్తలు శ్యామలమ్మ, పత్తిపాటి రమేష్ నాయుడు, సహదేవ నాయుడుతో పాటు కళాకారులు, సాహితీవేత్త పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రయోజనం: డాక్టర్ థామస్

వెదురుకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుని ప్రయోజనం పొందాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. వెదురుకుప్పం మండలం మొండివెంగనపల్లెలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎమ్మెల్యేని పలువురు సన్మానించారు. టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య, గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు సాతాల గుణశేఖర్‌యాదవ్, గురుసాల కిషన్‌చంద్, పోటుగారి తిరుమలయ్య, బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



కాకవేడు ఆదిఆంధ్రవాడలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

నగరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కాకవేడు ఆదిఆంధ్రవాడలో టీడీపీ నేత గుణశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం సభ్యత్వం కలిగిన వారెవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మదన్, సాయికుమార్, హరి, కుమారస్వామి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో పీఈఎస్ విద్యార్థుల ప్రతిభ



చిత్రలేఖనంలో గెలుపొందిన పీఈఎస్ పాఠశాల విద్యార్థులు

యాదమరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు సంసిద్ క్యాంఫోర్డ్ పాఠశాల వేదికగా ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్తూరు పరిసర ప్రాంత పాఠశాలలకు చెందిన దాదాపు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో మొదటి కేటగిరిలో పీఈఎస్ పాఠశాలకు చెందిన బి.మాన్సి మొదటి బహుమతి, బి.మాన్వి రెండవ బహుమతిని కైవసం చేసుకున్నారు. రెండవ కేటగిరిలో కె.సాహితి మొదటి బహుమతి, బి.లిఖిత రెండవ బహుమతి, జె.తేజేష్ మూడవ బహుమతిని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ట్‌మాస్టర్ దినేష్, విద్యార్థులను పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు అభినందించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నగరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబరకుప్పంలో టీడీపీ నాయకులు షణ్ముగసుందరం తల్లి, చింతలపట్టెడ దళితవాడలో అమ్ములు మృతదేహాలకు ఎమ్మెల్యే భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా చింతలపట్టెడలో ఏలుమలై భౌతికకాయానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి, సానుభూతి తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు వంద మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు వంద మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 2897మంది విద్యార్థులకు గాను 2797 మంది హాజరు కాగా, వంద మంది గైర్హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీ సోమవారం ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో కీని పరిశీలించి అభ్యంతరాలను ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సూచించారు.

దారి సమస్యకు పరిష్కారం



రోడ్డుపై గుంతను పూడ్చేసిన దృశ్యం

వెదురుకుప్పం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లె పంచాయతీ పొదలకుంట గ్రామానికి వెళ్లే దారిని ఓ వ్యక్తి శుక్రవారం జేసీబీతో తవ్వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అగ్గిచేనుపల్లెకు చెందిన టీడీపీ నేత సుబ్రహ్మణ్యంరెడ్డి ఇరువర్గాలతో చర్చలు జరిపి, తవ్వేసిన గుంతను పూడ్పించారని అగ్గిచేనుపల్లె, పొదలపల్లె గ్రామస్తుల ఆదివారం తెలిపారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

తవణంపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మామిడి పంట సాగు చేసే రైతులు ప్రభుత్వం కల్పించిన పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానాధికారి సాగరిక ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి పంటకు ఎకరం తోటకు రూ.1,750 బీమా చెల్లించి ప్రతికూల పరిస్థితుల వలన డిసెంబరు 15 నుంచి మే నెల 31 వరకు పంట నష్టపోతే ఎకరాకు రూ.35,000 పరిహారం బీమాను కంపెనీలు చెల్లిస్తాయన్నారు. అలాగే చీడ పీడలు, అధిక వర్షపాతం, గాలి వానలు, ముసురు వానల వలన, ప్రతికూల పరిస్థితుల వలన పంటలు నష్టపోతే మండల స్థాయిలో ఉన్న వాతావరణ పరికరాలతో లెక్కించి వాటి ఆధారంగా నష్టపరిహారాన్ని బీమా కంపెనీలు చెల్లిస్తాయని, బ్యాంక్‌లు, బీమా కంపెనీలు, ఇన్సూరెన్స్ ఏజెంట్‌ల ద్వారా బీమా చేసుకోవచ్చునని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మహిళామార్టు 'లెక్క' ఎక్కడ సార్...?

- ప్రతి గ్రూపు నుంచి రూ.3000 పెట్టుబడికి వసూలు చేశారు
- మరి లాభాల మాటేంటి: సభ్యులు

పెనుమూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు చౌక ధరలకు నిత్యావసర సరుకులు అందిస్తామని.. అందుకు గాను మహిళా మార్టును ప్రారంభించాలని గత ప్రభుత్వంలో పెనుమూరులోని డ్వాక్రా పెద్దలు డ్వాక్రా సంఘాల ద్వారా ఒక్కో మహిళ దగ్గర రూ.300 చొప్పున.. పది మంది ఉన్న గ్రూపు సభ్యుల నుంచి రూ.3000 చొప్పున వసూలు చేశారు. మండలంలో మొత్తం 936 డ్వాక్రా సంఘాల నుంచి సుమారు రూ.28 లక్షలు, స్త్రీనిధి ద్వారా కొంత సొమ్ము మూలధనం పెట్టుబడిగా వసూలు చేసి ఆ సొమ్ముతో జగనన్న మహిళా మార్టును పెనుమూరు పంచాయతీ భవనంలో 2023 మార్చిలో ప్రారంభించారు. నాణ్యమైన సరుకులు తెచ్చి బయట దుకాణాల్లో లభించే ధరల కన్నా తక్కువ ధరలకు సంఘ సభ్యులకు అందిస్తామని మహిళలకు సంఘమిత్రలు తెలిపారు. ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ముగియగానే ఆడిట్ నిర్వహించి వచ్చిన లాభాలను గ్రూపు సభ్యులకే జమ చేస్తామన్నారు. దీంతో మొదట్లో గ్రూపు సభ్యులతోపాటు అందరూ మహిళా మార్టులోనే సరుకులు కొనేవారు. రానురాను సరుకుల్లో నాణ్యత తగ్గడంతో కొనుగోళ్లు తగ్గాయి. దీంతో అప్పటి అధికారులు సంఘమిత్రలు ప్రతి సభ్యురాలు నెలకు వెయ్యి రూపాయలకు సరుకులు తప్పకుండా కొనాలనే నిబంధన అమలుచేశారు. అలా కొనని వారికి లోన్లు ఇచ్చేదిలేదని హుకుం జారీ చేశారు. డబ్బులు లేనివారికి సంఘంలో అప్పు కూడా ఇచ్చేలా ఏర్పాటు చేశారు. దీంతో కష్టమైనా సభ్యులు కొనేవారు. ఇలా రోజూ రూ.లక్ష వరకు సరుకులు కొనుగోలు చేసేవారు. ఒకవేళ గ్రూపు సభ్యులు కొనకపోతే వారికి సంబంధించిన సంఘమిత్రలు కొని అమ్ముకోవాలని సరుకులు వారికి ఇచ్చేవారు. ప్రతి నెల రూ.30 లక్షలపైనే సరుకులు అమ్మకాలు జరిగేవని.. మహిళా మార్టులో కోట్ల టర్నోవర్ జరుగుతుందని అప్పటి అధికారులు సర్వసభ్య సమావేశాల్లో గొప్పలు చెప్పుకునేవారు. అయితే ఆర్థిక సంవత్సరం ముగిసిన తరువాత ఏప్రియల్‌లో ఆడిట్ నిర్వహించి వచ్చిన లాభాలను సభ్యులకు జమ చేస్తామని చెప్పిన అధికారులు ఇంత వరకు పట్టించుకోకపోగా మళ్లీ సరుకులు కొనాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని పలువురు మహిళా సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్టులో లెక్కలు మాకు చెప్పరా... ఎంత లాభం వచ్చిందో అని కొందరు సంఘమిత్రలను అడిగినా వారు బదులు చెప్పలేకపోతున్నట్లు సమాచారం.



పెనుమూరులో మహిళామార్టు

ప్రభుత్వానికి ఆడిట్ నివేదిక సమర్పిస్తాం

మార్టులో సభ్యులు మూలధనం వాటాగా ప్రతి ఒక్కరి దగ్గర అప్పట్లో రూ.300 వసూలు చేశారు. గతంలో కొంత మంది సభ్యులు వాటా చెల్లించలేదని మా వాళ్లు చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం మహిళా మార్టుల్లో ఆడిట్ నిర్వహించి నివేదిక ఇవ్వాలని కోరింది. పెనుమూరు మార్టులో ఇంకా ఆడిట్ జరగలేదు. రిపోర్టు రాగానే తదుపరి వివరాలను తెలుపగలను. సభ్యులు సరుకులు కొనుగోలు చేస్తేనే మార్టు నడుస్తుంది.

\- చిరంజీవి, పెనుమూరు ఏపీఎం

అండర్‌పాస్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్

- ఎంపీ దగ్గుమళ్లను సన్మానించిన శెట్టిఫారం గ్రామస్థులు



ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును సన్మానిస్తున్న శెట్టిఫారం గ్రామస్థులు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలంలోని శెట్టిఫారం గ్రామం వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కృషితో ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. చిత్తూరు-తచ్చూరు హైవేరోడ్డు నిర్మాణంలో భాగంగా గంగాధరనెల్లూరు మండలం బంగారెడ్డిపల్లె పంచాయతీ శెట్టిఫారం గ్రామస్థులకు దారి సమస్య ఏర్పడింది. అప్పట్లో ఆ గ్రామానికి చెందిన ప్రజలు మండల, జిల్లా అధికారులకు, వైసీపీ ఎమ్మెల్యే ఎంపీలను కలసి దారి సమస్యను పరిష్కరించాలని పలుసార్లు విన్నవించినా మోక్షం లభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామస్థులు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎంపీ కేంద్ర హైవేరోడ్స్ శాఖ మంత్రి నితిన్‌గడ్కరిని కలిసి దారి సమస్యను వివరించి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందించి హైవేశాఖ అధికారులకు శెట్టిఫారం గ్రామంవద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ క్రమంలో పార్లమెంట్ టీడీపీ రైతువిభాగం అధికార ప్రతినిధి మోహన్‌నాయుడు, శెట్టిఫారం గ్రామస్థులు చంద్రానాయుడు, బాబునాయుడు, గుణభూషణనాయుడు, శ్రీనివాసులునాయుడు, యశోద, సుజాత, ఆదిత్యలతో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ రైతువిభాగం అధికార ప్రతినిధి మోహన్‌నాయుడు కలిసి ఆదివారం చిత్తూరులో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును కలిసి శాలువలతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

అసంపూర్తిగా ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణాలు

- కొట్రకోనలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం లేక ప్రజలు, ఉద్యోగులకు తప్పని తిప్పలు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్రకోన గ్రామంలో రెండు వేర్వేరు ప్రభుత్వ కార్యాలయాల కోసం నిర్మిస్తున్న పక్కా భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గంగాధరనెల్లూరు మండలంలోని కొట్రకోనలో సచివాలయం, రైతుభరోసా కేంద్ర కార్యాలయాలను పాత పంచాయతీ కార్యాలయ భవనంలో ప్రారంభించారు. కాగా, రూ.45లక్షలతో సచివాలయ భవనం, రూ.21.80లక్షలతో రైతు భరోసా కేంద్ర కార్యాలయ భవనాలకు అప్పట్లో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి శంకుస్థాపన చేశారు. ఈ రెండు పక్కా భవనాల నిర్మాణ పనులు చేసిన గుత్తేదారులకు బిల్లులు రాకపోయేసరికి మిగిలిన పనులు చేయలేక చేతులు ఎత్తేశారు. దీంతో ఆ రెండు భవనాల నిర్మాణం ఐదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయింది. పాత పంచాయతీ కార్యాలయ భవనంలో ఉన్న రెండు గదుల్లో ఒక గదిలోనే సచివాలయ, రైతు భరోసా ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా, మరొక గదిని ఫర్నీచర్, రికార్డుల నిర్వహణకు వాడుతున్నారు. దీంతో పలు గ్రామాల నుంచి వచ్చే ప్రజలు తమ సమస్యలు తెలియజేసేందుకు కూడా అక్కడ స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులకు టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో సమీపంలోని పొలాల్లోకి వెళ్లాల్సి వస్తోంది. టీడీపీ నేతలు ప్రసాద్ నాయుడు, నరసింహులు నాయుడు, నాగరాజయాదవ్‌లు అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలను పూర్తి చేయాలని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎంపీడీవో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే రైతుభరోసా కేంద్ర భవన నిర్మాణాన్ని ముందుగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.





అసంపూర్తిగా నిలిచిపోయిన రైతుభరోసా కేంద్ర భవనం

అసంపూర్తిగా ఉన్న సచివాలయ కార్యాలయ భవనం



పాత పంచాయతీ భవనంలోని ఇరుకుగదిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

సారా తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు



సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప

పాలసముద్రం,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో నాటుసారా తరలిస్తున్న ఓ వ్యక్తిని, సారా విక్రయిస్తున్న మరో వ్యక్తిని పాలసముద్రం ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఆదివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు మధునాయుడు మండలంలోని నరసింహాపురం గ్రామానికి చెందిన పాండురంగన్ వద్ద 40 లీటర్ల సారా ప్యాకెట్లు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా ఎస్‌ఐ తన సిబ్బందితో కాపు కాచి పట్టుకున్నారు. సారా విక్రయించిన పాండురంగన్ పారిపోగా, తరలిస్తున్న మధునాయుడును అరెస్టుచేసి ద్విచక్ర వాహనాన్ని, సారాను స్వాధీన పరచుకున్నారు. అలాగే పాలసముద్రం కాలనీలో సారా విక్రయిస్తున్న రామచంద్రన్‌ను అరెస్టు చేసి, 10 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మాదాయ శాఖ సూచనల మేరకు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆస్థాన మండపంలో ఆదివారం అధికారులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి అరవింద్ ఐ ఆస్పత్రి సౌజన్యంతో ఆలయ అధికారులు ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది ఉచిత కంటి ఆపరేషన్‌కు ఎంపిక కాగా, వారిని తిరుపతి అరవింద్ ఐ ఆసుపత్రికి తరలించారు. ఆలయ ఈవో పెంచలకిషోర్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

\- ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్



టీకేఎంపేట కాలనీలో సమస్యలు వింటున్న థామస్

వెదురుకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. ఆదివారం కార్వేటినగరం మండలం టీకేఎంపేట పంచాయతీ రాజులకండ్రిగలో ఉపాధి హామీ పథకంద్వారా రూ.10లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్యేని పలువురు సన్మానించారు. టీకేఎంపేట కాలనీలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్వేటినగరం మండల టీడీపీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడులు

- బెంబేలెత్తుతున్న ప్రజలు

శ్రీరంగరాజపురం డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలంలో వీధి కుక్కల దాడులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. 49.కొత్తపల్లె మిట్టలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ, చిన్నారులు, వృద్ధుల వెంట పడుతున్నాయి. చిన్న పిల్లలు భయంతో వణికిపోతున్నారు. రహదారుల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడిస్తుండడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. 49.కొత్తపల్లెమిట్ట చిత్తూరు-జాతీయ రహదారిపై కోళ్ల వ్యర్థాలు వేయడం వల్ల వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల 49.కొత్తపల్లెమిటల్లో ఓ పిచ్చికుక్క ముగ్గురిని గాయపరించింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలుతీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



49.కొత్తపల్లెలో కుక్కల గుంపు

ఘనంగా సపోస్ క్రిస్మస్ వేడుకలు



కార్వేటినగరంలో క్రైస్తవుల ప్రదర్శన

వెదురుకుప్పం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని బాలగుంట వద్ద ఉన్న బేతేల్ షారోన్ చర్చిలో ఆదివారం క్రైస్తవులు సపోస్ క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ఆశీర్వాదం, విశ్వాసకులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల డివిజన్ కమిటీ ఏకగ్రీవం



డివిజన్ కమిటీ సభ్యులను సన్మానం చేసిన దృశ్యం

నగరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరి డివిజన్ పరిధిలోని కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరిలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు తమ డిమాండ్ల సాధనకు నిరసనలు తెలపాలని నిర్ణయించుకున్నారు. నూతన కమిటీ ఛైర్మన్‌గా షకీలా, ప్రధానకార్యదర్శిగా మురళి, వైస్‌ఛైర్మన్‌గా వేలాయుధం, గౌరవ అధ్యక్షుడిగా జయపాల్, ప్రచార కార్యదర్శిగా మస్తాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోపీనాథ్, అధికారప్రతినిధిగా మునిబాబు, మున్సిపాలిటీ పరిధిలో కమిటీ వైస్ ఛైర్మన్‌గా ప్రతాప్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

టీడీపీ కార్యకర్తకు పలువురి నివాళి



గోవిందస్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న జయప్రకాష్

బంగారుపాళ్యం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నలగాంపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త గోవిందస్వామి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు జయచంద్ర నాయుడు, సురేంద్ర నాయుడు, జనార్దన్ గౌడ్, పలువురు కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. గోవిందస్వామి మృతితో ఓ సిన్సియర్ టీడీపీ నాయకుడిని కోల్పోయామని వారు తెలిపారు. కాగా గోవిందస్వామి కళ్లను రుయా ఆస్పత్రికి నేత్రదానం చేసినట్లు కుటుంబసభ్యులు చెప్పారు.